రైతు బీమాపై ప్రచారమేది?

- అవగాహన లేక పథకానికి దూరమవుతున్న రైతులు
- ఆగస్టు 5వ తేదీ వరకు గడువు
- మార్పులు, చేర్పులకు నేడే చివరి అవకాశం

ఖిలా వరంగల్: కష్టకాలంలో రైతు కుటుంబాలకు బాసటగా నిలిచే రైతు బీమాపై అవగాహన కల్పించేందుకు వరంగల్ జిల్లాలో ప్రచారం కొరవడింది. సదరు రైతు ఏ కారణంగా మరణిస్తే ఆ కుటుంబం వీధిన పడకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఇంత ప్రాధాన్యమున్న ఈ పథకంపై అవగాహన లేక వేలాది మంది రైతులు దరఖాస్తు చేసుకోవడం లేదు. ఫలితంగా కష్టకాలంలో రూ.5లక్షల పరిహారం అందడం లేదు. వరంగల్ జిల్లాలో 2.84లక్షల పైగా వ్యవసాయదారులు ఉంటే 90శాతం మంది సన్న, చిన్నకారు రైతులే అధికంగా ఉన్నారు. ఇందులో రైతు బీమాలో చేరని రైతులు సంఖ్య వేలల్లో ఉన్నారు. వారంతా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

రైతు బీమాపై ప్రచారం కరువు

రాష్ట్ర ప్రభుత్వం ఏటా జులై, ఆగస్టు మాసాల్లో నిర్దేశిత గడువు ప్రకటించి అంతలోపు రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచిస్తోంది. వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటనలు విడుదల చేసి ఆ తర్వాత ప్రచారం చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సమావేశాలు, ప్రచారం లేకపోవడంతో చాలా మందికి ఈ సమాచారం చేరడం లేదు. ఈ ఏడాది ఆగస్టు 5వ తేదీ వరకు రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్తగా వ్యవసాయ భూమి కొనుగోలు చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఇది వరకే పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నా రైతులు, బీమాలో పేర్లు లేని వారంతా సమీప వ్యవసాయ శాఖ క్లస్టర్ కార్యాలయానికి లేదా మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. బీమా ఉన్న వారు తమ పేర్లలో పొరపాటు దొర్లినా, ఆధార్ నంబర్ తప్పుగా నమోదైనా, బ్యాంకు ఖాతా నంబర్ సరిగా లేకపోయినా ఈనెల 30లోపు సరిచేసేందుకు అవకాశముంది.

అర్హతలు

18నుంచి 59 ఏళ్ల వయస్సు ఉండి, తమ పేరిట భూమి, పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న రైతులందరూ రైతు బీమాకు అర్హులే. 2024, జులై 28 నాటికి కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఏఈఓల వద్ద దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రీమియాన్ని చెల్లించాల్సిన అవసరం లేదు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ పత్రాలతో నిర్దేశిత దరఖాస్తు పత్రాన్ని అధికారులకు సమర్పిస్తే లబ్ధిదారుగా నమోదు చేస్తారు. ప్రభుత్వమే బీమా కంపెనీకి ఏటా ప్రీమియం చెల్లిస్తుంది. బీమా కలిగి ఉన్న రైతు మరణిస్తే మరణ ధ్రువ పత్రాలను వ్యవసాయ అధికారులకు బాధిత కుటుంబ సభ్యులు సమర్పించాలి. బీమా సొమ్మును నామినీ ఖాతాలో అధికారులు జమ చేస్తారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి



కొత్త పట్టా పాస్‌బుక్ పొందిన రైతులంతా తప్పనిసరిగా ఏఈఓల వద్ద దరఖాస్తు చేసుకోవాలి. మార్పులకు కూడా అవకాశం ఉంది. అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈమేరకు రైతులకు ఏఈఓల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. తుది గడువు నాటికి ప్రక్రియను పూర్తి చేస్తాం.
– ఉషా దయాళ్, జిల్లా వ్యవసాయ అధికారి

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



హాస్టల్‌లో వంటగదిని పరిశీలిస్తున్న నాయకులు



కాజీపేట: సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

ఖిలా వరంగల్: సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరూరి కుమార్ డిమాండ్ చేశారు. వరంగల్ అండర్ బ్రిడ్జి జీవుల అడ్డా సమీపంలోని సంక్షేమ హాస్టళ్లను వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో సమస్యలపై అధ్యాయన యాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులను కలిసి వారి సమస్యలు, మౌలిక సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఉసిల్ల కుమార్, ఇమ్మడి శ్రీనివాస్, మంద కృష్ణ, దరిపెల్లి కుమార్, ఎలిషా, వెలుశమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సదుపాయాలు కరువు

కాజీపేట: విద్యానగర్ కాలనీలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి సాంబయ్య డిమాండ్ చేశారు. కేవీపీఎస్ కార్యకర్తలతో కలిసి గురుకుల పాఠశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. జిల్లా కార్యదర్శి మంద సంపత్, సారంగపాణి, గణేష్, రమేష్, లింగన్న, అనిత పాల్గొన్నారు.

ఆశాల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఆశ కార్యకర్తలు

న్యూశాయంపేట: ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం ఒత్తిడి తేవడానికి మంగళవారం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హనుమకొండ సుందరయ్య భవన్‌లో తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీహెచ్.రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) 15 మంది కమిటీ సభ్యులతో కూడిన జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా పద్మ, ప్రధాన కార్యదర్శిగా శ్వేత కోశాధికారిగా శోభ, ఉపాధ్యక్షులుగా యాకూబీ, సభ్యులను ఎన్నుకున్నారు.

ఆశ వర్కర్ల అరెస్టులను ఖండిస్తున్నాం

రామన్నపేట: ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 30న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆశలను పోలీసులు ముందుస్తు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు కాసు మాధవి, జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి తెలిపారు. పలువురు ఆశ వర్కర్లను మట్టెవాడ పోలీసులు సోమవారం అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు.

కూలీ భరోసా పథకం ప్రవేశపెట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రాములు

ఖిలా వరంగల్: జాతీయ ఉపాధి హామీ పనులకు కేంద్రం రూ.2.70 కోట్ల నిధులు కేటాయించాలని, వ్యవసాయ కూలీలకు కూలీ భరోసా పథకం ప్రవేశపెట్టాలని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో హంస మంజుల అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సమగ్ర సంక్షేమ చట్టం చేసి అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, సామాజిక పింఛన్‌ను రూ.4వేలకు పెంచి అమలు చేయాలని ఆయన కోరారు. ఆగస్టు 3, 4వ తేదీల్లో వేములవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిలువేరి విజయ, రమేష్, పిట్టల సతీష్, జాన్‌పాల్, భాగ్య, చింతల సారయ్య, అశోక్, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిబ్బంది

ఎంజీఎం: కార్మికవర్గ హక్కులు, కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా ఆగస్టు 4న వరంగల్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఎంజీఎం సెక్యూరిటీ గార్డ్స్, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బంది పిలుపునిచ్చారు. ఈ మేరకు రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఎంజీఎం ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 4లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానాన్ని చేసి ఇప్పుడున్న కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, తదితర డిమాండ్లతో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంజీఎం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది గొర్రె నాగరాజు, రాజుబోయిన రాజు, తుల సుధాకర్, కందుకూరు పుష్ప, రాజావీర్, ఇంద్ర, విజయ్, కోమల, మంజుల, అశోక్, రాజేష్, రాజమణి, జ్యోతి, సుద్దాల నాగరాజు, చందు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

బాలల అభివృద్ధికి ముందుకు రావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పరశురాములు

కాశిబుగ్గ: నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, అలాంటి బాలల అభివృద్ధికి కోసం ప్రతిఒక్కరు చేయూతనందించాలని సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ మండల పరశురాములు పిలుపునిచ్చారు. శివనగర్ ప్రాంతంలోని డాన్‌బాస్కో బాలల గృహంలో బాలల అభివృద్ధి – సమాజ బాధ్యతపై సోమవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల రక్షణ, సంరక్షణ శారీరక, మానసిక అభివృద్ధిపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బాలలు సమాజానికి అతి ముఖ్యమైన వనరులని, వారికి సరైన విద్య, ఆరోగ్య, సాంఘిక సేవలు అందించాల్సిన అవసరం తామందరిపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో డాన్‌బాస్కో సిబ్బంది దివ్య, శారద, రాజు, అనిత, భారతి, ఉల్లాస, వసంత, జ్యోతి, బాలల హక్కుల కార్యకర్త ఎండీ.బాల్‌పాషా, బచ్‌పన్ బచావో ఆందోళన్ కోఆర్డినేటర్ శిరీష, బాలలు బాలికలు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రం వివక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్ రెడ్డి

వరంగల్ చౌరస్తా: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆయా రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిందని, సమానమైన పద్ధతుల్లో ఆయా రాష్ట్రాల ఆదాయం ప్రాతిపదికన నిధులు కేటాయించలేదని ఎంసీపీఐ (యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి విమర్శించారు. వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం గడ్డం నాగార్జున అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 శాతం ఉన్న వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో 40శాతం నిధులు మాత్రమే కేటాయించినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారీ, కార్పొరేట్ వర్గాల ప్రయోజనం కోసమే ఈ బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయని ధ్వజమెత్తారు. బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపినందుకు నైతిక బాధ్యతగా 8 మంది బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి, సహాయ కార్యదర్శి నీల రవీందర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాస్ సావిత్రి, కర్ర రాజిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మొగిలి శ్రీనివాసరావు, ఇంద్రారెడ్డి, ఉస్మాన్, కుసం బుచ్చయ్య, వక్కాల కిషన్, దామరకొండ రమేష్, రాజేశ్వరరావు, ప్రభాకర్, మంద భద్రయ్య, రవీందర్, బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

వృత్తికి, జాతికి సేవలు చేస్తున్న బానోత్ వెంకన్న

హన్మకొండ: వృత్తితో పాటు జాతికి మున్సిపల్ చీఫ్ సిటీ ప్లానర్ బానోత్ వెంకన్న నాయక్ సేవలు అందిస్తున్నారని మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ ప్రశంసించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న వెంకన్న నాయక్.. అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా హనుమకొండలోని జీఎస్ కన్వెన్షన్‌లో గోర్ బంజార సంక్షేమ సంఘం, బంజార సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడుతూ బంజార భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా బంజారాలు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గోర్ బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాదావత్ బాలాజీ నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీపీ రాగ్యా నాయక్, రాష్ట్ర తహసీల్దార్ల సంఘం ప్రధాన కార్యదర్శి ఫూల్ సింగ్ చౌహాన్, గోర్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ కిరణ్, గోర్ సిక్వాడీ ఉమ్మడి జిల్లా కోఆర్డి నేటర్ హత్యా నాయక్, ఎస్‌బీఐ ఏజీఎం శంకర్‌నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

మొక్కలే మానవాళికి ప్రాణాధారం



మామునూరు: మొక్కలే మానవాళికి ప్రాణాధారమని రంగశాయిపేట డెవలప్‌మెంట్ కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్, గణేష్‌నగర్ కాలనీ అధ్యక్షుడు విజయ్ సూచించారు. వరంగల్ 43వ డివిజన్ గణేష్‌నగర్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆలయ అధ్యక్షుడు నెల్లూరి శ్రీనివాస్, రాధాకిషన్, సారంగం, సుతారి రాజు, ఆలయ పూజారి వేణునాథాచార్యుల ఆధ్వర్యంలో పలు రకాల మొక్కలను సోమవారం నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొమురెల్లి, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, రవిబాబు, బండి అశోక్, వెంకట్ రవి, బాబు, కిరణ్, రాకేష్, సుమన్ పాల్గొన్నారు.

సినారెకు ఘన నివాళి



హసన్‌పర్తి: ప్రముఖ రచయిత, జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి జయంతి వేడుకలను హసన్‌పర్తి మండలం ముచ్చర్లలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సినారె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానికులు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీధర్, రాజేష్, ముత్తినేని రమేష్, చిర్ర శ్రవణ్, వెంకటేష్, దేవేందర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై కేంద్రం నమ్మక ద్రోహం

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నమ్మక ద్రోహం చేస్తోందని ఎమ్మార్పీఎస్ (మేడి పాపయ్య) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాతూరి వెంకన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలుమారి బాలస్వామి ఆరోపించారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నా కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 9న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మేడి పాపయ్య ఆధ్వర్యంలో మాదిగల మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. 2014 ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన బీజేపీ.. అధికారంలోకి వచ్చి నరేంద్ర మోదీ ప్రధానిగా మూడోసారి పదవీ బాధ్యతలు చేపట్టినా కూడా ఎస్సీ వర్గీకరణ ఊసే ఎత్తడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గంగారపు సుమన్ కుమార్, మస్కె సదయ్య, సాతూరి కోమల, చిలుక గోపి, తూముల రాజ్‌కుమార్, కొడవటి తిరుపతి, గంగారపు యశ్వంత్, ఇలాపాక దయసాగర్, చిలుక రాజేష్, లక్షమల ప్రకాష్, తుడుముల నంద కిషోర్, దామెర కరుణ, సత్య కుమారి, ఇమ్మడి ప్రసన్న పాల్గొన్నారు.

మభ్యపెట్టి.. మాయచేశాడు

ఖిలా వరంగల్ : వరంగల్ ఉర్సు కరీమాబాద్ ప్రాంతానికి చెందిన మామిండ్లపల్లి సారంగపాణి, ధనలక్ష్మి దంపతులు తమ కుమార్తెల పెళ్లి కోసం వారు భూమిని విక్రయించారు. ఈ క్రమంలో వారి సమీప బంధువైన వరంగల్ ఎస్ఆర్‌నగర్ కాలనీకి చెందిన క్షుద్ర పూజారి కుదురుపాక వెంకటేశ్వర్లు(55).. వారి వద్ద ఉన్న నగదుపై కన్నేశాడు. ఆడపిల్లల పెళ్లికి కట్నం కింద ప్లాటు చూపిస్తే సరిపోతుందని నమ్మించాడు. ఈ క్రమంలో వరంగల్ వివేకానంద కాలనీకి చెందిన కె.సతీష్ 266 గజాల ఇంటి స్థలాన్ని రూ.30.21 లక్షలకు బయానగా రూ.20 లక్షలు చెల్లించారు. ఎవరికి తెలియకుండా మిగతా డబ్బులు చెల్లించి వెంకటేశ్వర్లు తన పేరిట ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. పలు రకాలుగా నమ్మిస్తూ మొత్తం రూ.36 లక్షలు తీసుకుని ముఖం చాటేశాడు. దాంతో ఈనెల 20న మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో కుదురుపాక వెంకటేశ్వర్లు, అతడి కుమారుడు జయప్రకాశ్‌పై బాధితులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా సోమవారం వెంకటేశ్వర్లును విచారిస్తుండగా మిల్స్‌కాలనీ పోలీసులు తన నాన్నను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ జయప్రకాశ్ ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. పోలీసుల జోక్యంతో కిందికి దిగాడు.

సంక్షిప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

కాశీబుగ్గ సెంటర్: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భోగేశ్వర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి మనోజ్, ఉపాధ్యక్షులు జె.స్వామి, ఎండి తన్వీర్, బుచ్చాచారి, ఉమ్మడి వరంగల్ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి ఉటుకూరి అశోక్ పాల్గొన్నారు.

నేడు రెండో విడత రుణమాఫీ

కాశీబుగ్గ సెంటర్: రెండో విడత రుణమాఫీ నిధులను మంగళవారం మధ్యాహ్నం సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేయనున్నారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణమాఫీ కార్యక్రమం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ సత్యశారదాదేవి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వివరించారు. వరంగల్ జిల్లాలో 14,510 మంది రైతులకు రూ.142.58 కోట్లు మాఫీ కానుందని వెల్లడించారు.

అదుపు తప్పుతున్న విద్యార్థులు

కాజీపేట: సోషల్ మీడియాతో పాటు పెరిగిన టెక్నాలజీ వాడకంతో నానాటికి విద్యార్థుల్లో క్రమశిక్షణ అనేది లేకుండా పోతోందని బీసీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. కాజీపేట పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ లోపించడంతో కన్నవాళ్లతో పాటు గురువులపై తిరుగుబాటు మనస్తత్వం కనబరుస్తుండడం బాధాకరమని వాపోయారు. వారిని పాఠశాల స్థాయిలో సరైన దారిలో పెట్టడం ఉపాధ్యాయులకు కత్తిమీద సాములా మారిందన్నారు.

చేనేత కార్మికుడి హఠాన్మరణం

వరంగల్ / రామన్నపేట: వరంగల్ కొత్తవాడ ప్రాంతానికి చెందిన చేనేత కార్మికుడు వన్నాల శ్రీనివాస్ (43) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం గత పదేళ్లుగా కాకతీయ చేనేత సహకార సంఘంలో మగ్గం నేస్తూ సోమవారం తీవ్రమైన గుండెనొప్పి రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ చేనేత విభాగం రాష్ట్ర నాయకుడు చిప్ప వెంకటేశ్వర్లు సంతాపం తెలిపి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. త్రిఫ్ట్ పథకంలో సభ్యుడిగా శ్రీనివాస్ ఉన్నందున దహన సంస్కారాలకు రూ.25 వేలు, చేనేత బీమా తరఫున రూ.5 లక్షలు ప్రభుత్వం నుంచి వచ్చేందుకు కృషి చేస్తామని వివరించారు.

'ప్రజా కలల'ను విజయవంతం చేయాలి

న్యూశాయంపేట: హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆగస్టు 7న జరగనున్న ప్రజా కలల పండుగను విజయవంతం చేయాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ పిలుపునిచ్చారు. హనుమకొండ బాలసముద్రం సీపీఐ కార్యాలయంలో తెలంగాణ ప్రజానాట్య మండలి హనుమకొండ, వరంగల్ జిల్లాల నిర్మాణ మహాసభలు సోమవారం జరిగాయి. దామెర కృష్ణ అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆయన మాట్లాడుతూ కళాకారులకు గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్, హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పలయ్య, రమేష్, అశోక్ స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పీఐ గౌరవాధ్యక్షురాలిగా చేపూరి విజయ

హన్మకొండ: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జ తాకరం) ఉమ్మడి వరంగల్ జిల్లా గౌరవాధ్యక్షురాలిగా చేపూరి విజయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాబయ్య తెలిపారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన ఉమ్మడి జిల్లా సమావేశంలో హనుమకొండ ప్రశాంత్‌నగర్‌కు చెందిన న్యాయవాది చేపూరి విజయను గౌరవాధ్యక్షురాలిగా ఎన్నుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకేశ్వరపు రమేష్ మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు.

ఆలయాల అభివృద్ధికి విరాళం

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ మెట్ల బావి సమీపంలోని ధనమైసమ్మను సామాజిక వేత్త మేరుగు అశోక్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ధనమైసమ్మ, పుప్పాలగుట్ట ముత్యాలమ్మ ఆలయాల అభివృద్ధికి రూ.25వేల చొప్పున రూ.50 వేలను అందజేశారు. అనంతరం అశోక్‌కు ఆలయ కమిటీ ప్రతినిధులు తీర్థప్రసాదాలు అందజేసి సన్మానించారు. గడ్డం రవి, ఆలయ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాస్, అర్చకులు కందుల కుమార్, అప్పికట్ల చిరంజీవి, బీర కిషన్, గటిక రాంచందర్, రాజేంద్రప్రసాద్, కుమారస్వామి, అంకతి అఖిల్, శివ, ప్రణీత్, అజయ్, సాయి, తౌటం శివ పాల్గొన్నారు.

మత్స్యకారుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

న్యూశాయంపేట: చేపల వేటలో ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుడు మౌటం రాజేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ మత్స్యకారులు, కార్మిక సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ డిమాండ్ చేశారు. హనుమకొండలో జిల్లా అధ్యక్షుడు నిమ్మల విజేందర్ అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో వెంకట్ మాట్లాడారు. కమలాపురం మండలానికి చెందిన రాజేష్.. గ్రామంలోని పెద్ద చెరువులోకి ఆదివారం చేపల వేటకు వెళ్లి వలలో కాళ్లు చిక్కుకుని ప్రమాదవశాత్తు మృతిచెందాడని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు పవన్ కల్యాణ్, సమ్మయ్య పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ మహిళా నాయకురాలు అర్చన కుమారుడు శ్యామ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా తెలంగాణ స్టేట్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సోమవారం పరామర్శించారు. 47వ డివిజన్‌కు చెందిన ఇర్ఫాన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా అతడి యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు అశోక్ తల్లి ఇటీవల మృతిచెందడగా, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సందెల విజయ్‌కుమార్, కాసర్ల నాగేష్, గంగుల రాజిరెడ్డి, సత్యవరం మధుకర్, మద్దెల శోభారాణి, కృష్ణ, వంశీ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

దేశాయిపేట: వరంగల్ దేశాయిపేటకు చెందిన కురే రమేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈమేరకు అతడిని బీజేపీ నేత, వరంగల్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు సోమవారం పరామర్శించి యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్థికసాయం అందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మామునూరు: ఖిలా వరంగల్ మండలం ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు ఆర్టీసీ బస్‌షెల్టర్‌లో సోమవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఘటనా స్థలానికి స్థానిక కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్‌తో కలిసి ఎస్సై కృష్ణవేణి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు.

క్లుప్తంగా

'సఖి' సేవలపై అవగాహన

నయింనగర్: బాధిత మహిళలు, బాలికలకు అందిస్తున్న సఖి సెంటర్ సేవలపై అవగాహన కల్పించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో బాధితులకు కౌన్సెలింగ్ సహాయం, వైద్య, పోలీస్, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి అందిస్తున్నట్లు లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత వివరించారు. రామప్ప కళాశాల విద్యార్థినులకు సఖి సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేస్ వర్కర్ హరిత మాట్లాడుతూ పనిచేసే చోట లైంగిక వేధింపులు, గృహహింస, అత్యాచారాల నుంచి రక్షణ పొందడానికి 181 టోల్‌ఫ్రీ నంబర్ లేదా 0870 2452112 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'భద్రకాళి'లో పీపీ పూజలు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ సోమవారం సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీపీకి అర్చకులు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి మహాదాశీర్వచనం చేశారు.

నేటినుంచి శిక్షణ తరగతులు



ఖిలా వరంగల్: ఈనెల 30, 31వ తేదీల్లో వరంగల్ హంటర్‌రోడ్డులోని పీఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరగనున్న సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమకాలిన రాజకీయ పరిస్థితులు, సమాజంలో పెరిగిపోతున్న మతోన్మాదం, లౌకికవాదం, మార్క్సిజం అంటే ఏమిటనే అంశాలపై లోతైన శిక్షణ తరగతులు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో దండు లక్ష్మణ్, ఓర్సు రాజు, అక్బర్‌పాషా, యాకూబ్, రాజేందర్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాలపై ఆరోపణలు చేయడం తగదు

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లోని నిబంధనలు, ఫీజులపై ప్రశ్నిస్తే విద్యార్థి సంఘాలు బ్లాక్ మెయిల్ చేస్తున్నాయంటూ కళాశాలల యజమాన్యాలు అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని ఏఐఎస్‌బీ రాష్ట్ర నాయకుడు హకీంనవీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక కళాశాలకే అనుమతి పొంది అనే బ్రాంచ్‌లను ఏర్పాటు చేసి ఫీజుల పేరిట చేస్తున్న దోపిడీ చేస్తూ, ఇందేటని ప్రశ్నించిన విద్యార్థి సంఘాలపై చందాల పేరిట అసత్య ప్రచారాలు చేస్తూ తమ ప్రతిష్టను దెబ్బతీయడం తగదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడుస్తుంటే బహిరంగ చర్చకు తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాల అసోసియేషన్ నాయకులు రావాలని సవాల్ విసిరారు. ఆరోపణలను ఉపసంహరించుకోవాలని సూచించారు.

కార్మికుల గద్దె నిర్మాణంపై ఘర్షణ

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ చిన్న బ్రిడ్జి రోడ్డులోని (మేదరివాడ) భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద కార్మిక గద్దె నిర్మాణ విషయంపై కార్మిక సంఘం ప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. కార్మికుల గద్దెను కొంతమంది కూలగొట్టడంతో కార్మిక నేతలు మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

తప్పిపోయిన వ్యక్తి అప్పగింత



ఖిలా వరంగల్: మిస్సింగ్ కేసును వరంగల్ మిల్స్‌కాలనీ పోలీసులు ఛేదించారు. కరీమాబాద్ ఆర్ఆర్‌తోటకు చెందిన గోనెల లింగమూర్తి, వనమాల దంపతులు గొడవ పడ్డారు. దాంతో కుటుంబ సభ్యులకు చెప్పకుండా ఈనెల 5వ తేదీన రాజ్‌కుమార్ ఇంటిలో నుంచి బయటికి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. దాంతో ఈనెల 8న మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో రాజ్‌కుమార్ ఆచూకీని కనిపెట్టి కుటుంబ సభ్యులకు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య సోమవారం అప్పగించారు.

బండారు అంకయ్య మృతి

విద్యారణ్యపురి: కరీంనగర్‌కు చెందిన వరంగల్‌కు ఎంతో అనుబంధం కలిగిన కవి, రచయిత, నాటకకర్త బండారు అంకయ్య (84) మరణం సాహిత్య, సాంస్కృతిక రంగాలకు తీరని లోటని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్, కేయూ తెలుగు విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, రచయిత బన్న అయిలయ్య అన్నారు. అంకయ్య మృతికి పలువురు సోమవారం సంతాపం తెలిపారు.